**హిమబిందు**






మన గాలి, మన నేల, మన వాళ్ళు,

మన లోగిళ్ళు...... నెలనెలా ఓ దృక్కోణం

## లాజిక్కే...మరి!

"కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని విద్యా సంస్థలతో పాటు ఐఐటి, ఐఐఎమ్, ఎయిమ్స్ వంటి విద్యా సంస్థలలో ఇతర వెనుకబడిన కులాల (ఒబిసి)లకు 27శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో వెనుకడుగు వేసే అవకాశమే లేదని యుపిఎ ప్రభుత్వం ఇటీవల తేల్చి చెప్పింది. అయితే ఈ రిజర్వేషన్ల వల్ల ఓపెన్ క్యాటగిరి విద్యార్థులకు సీట్లు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ప్రధాని మన్‌మోహన్ ప్రకటించారు". ఇప్పటికి ఇది తాజా వార్త!

గత నెల రోజులుగా, ఈ రిజర్వేషన్లకు సంబంధించిన అనేక వార్తలు, వాదోపవాదాలు, వ్యాసాలు చదువుతూ.... బాబోయ్ మరో 'మండల్ మంట' రాజుకుందేమోననే భయం మొదలయింది. రిజర్వేషన్లనేవి రాజకీయావసరాలకు ఉపయోగపడేవి తప్ప మానవీయ ధృక్పథానికి సంబంధించిన అంశమనే స్పృహ నేటి మన నాయకులకి లేదు. వాస్తవం మాట్లాడాలంటే, అసలు వాళ్ళకా స్థాయి ఉండాలని ఆశించడం మనం ఏనాడో మానేశాం. అందుకే, వారెంత వికృతంగా, నిస్సిగ్గుగా ప్రవర్తించినా మనకి అసహజంగా అనిపించడం లేదు.... పై పెచ్చు ఆ జాతి లక్షణంగా స్వీకరిస్తున్నాం.

కానీ నా ఆందోళన అంతా విద్యార్థుల గురించే... ఇందుకు రిజర్వేషన్ అనుకూల/ వ్యతిరేక ఆందోళన చేస్తున్న ఏ విద్యార్థీ మినహాయింపు కాదు. భవిష్యత్తును గురించిన ఆరాటం, పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావడంలో ఉండే అడ్డంకులు, సామాజిక, ఆర్థిక, కుటుంబపరమైన ఒత్తిడులకు లోనవుతూ, మరో వైపు భావోద్వేగానికి దారి తీసే ఇటువంటి సున్నితాంశాలలో వారు సమతుల్యత పాటించగలరా? అనేది నా సందేహం... సమాధానం మీకు తెలుసు... ఉడుకు రక్తపు గమనం అంచనాలకు అందేదా?

నేనీ కాలమ్ రాసే సమయానికి ఢిల్లీలోని ఓ గ్రాడ్యుయేట్ ఆత్మాహుతికి పాల్పడ్డాడు. 30 నుంచి 40 శాతం దాకా అతని శరీరం కాలింది. ఇందుకు పర్యవసానం ఏమిటి? నష్టం ఎవరికి? లాభపడుతోంది ఎవరు? కాల్చుకునే రెండు నిమిషాలకు ముందు ఆ అబ్బాయి ఈ ప్రశ్నలు వేసుకుంటే అతని చర్యలో మార్పు ఏమైనా ఉండేదేమోనని నా ఆశ... రిజర్వేషన్లను రాజకీయం చేయడం ద్వారా వొచ్చి పడే ఓట్ల ముందు ఈ గ్రాడ్యుయేట్ జీవితం రాజకీయ పార్టీలకో లెక్కా....?!

కానీ విద్యార్థుల ప్రశ్నలు, లెక్కలు... ఇక్కడి నుంచే ప్రారంభం కావాల్సిన అవసరం ఉంది. రాజకీయ పార్టీల కుట్రలను ఛేదించి, గ్రౌండ్ రియాలిటీస్ కోసం పోరాటం చేయడానికి తమ సమయం వెచ్చించాలి తప్ప, వారి కుట్రలకు తెలిసో తెలియకో ఉపయోగపడుతూ సమిధలు కావడం వివేకం కాదు. దేశంలో ఉన్న విద్యార్థుల సంఖ్యతో పోల్చుకుంటే, ఓ పది పన్నెండు ఉన్నత విద్యాసంస్థలలో కల్పించే ఈ రిజర్వేషన్లు 'అవసరమైన' వారికి అంత ఉపయోగపడేవేం కాదు. పైగా ఆ స్థాయికి ఎదగాలంటే

కావాల్సిన ప్రాథమిక, సెకండరీ, కాలేజీ స్థాయి విద్యావకాశాలు రిజర్వేషన్లతో సంబంధం లేకుండా సామాన్యులందరికీ అందని ద్రాక్షలవుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో ఉన్న బడులు మూసేస్తున్నారు. సరైన సంఖ్యలో టీచర్లు ఉండటం లేదు... ఇక గవర్నమెంట్ కాలేజీల్లో కొన్ని కోర్సులే ఎత్తేస్తున్నారు. ఒకప్పుడు వెలుగు వెలిగిన గుంటూరు హిందూ కాలేజీ లాంటి సంస్థలు నేడు వెల వెలా పోతున్నాయని ఈ మధ్యే ఓ ప్రముఖ దినపత్రికలో చదివాను. తలతాకట్టు పెట్టయినా సరే, ప్రయివేటు స్కూలు, రెసిడెన్షియల్ కాలేజీలు, కోచింగ్ సెంటర్లలో తప్పితే, వేరేవీ విద్యార్జనకు పనికి రావనే భావన ప్రజలకు 'తప్పనిసరి' అవుతోంది. ఇందుకు కారణం ప్రభుత్వ నిర్లక్ష్యం... ఈ కోణాన్ని నిశితంగా పరిశీలిస్తే, చాలా కంతిరీతనంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తమ బాధ్యతల నుంచి నెమ్మది నెమ్మదిగా తప్పుకుంటున్నట్టనిపిస్తోంది. విద్యను 'పెట్టుబడి'గా మాత్రమే చలామణీ అయ్యేలా ఎందుకు తయారు చేస్తున్నారని, అలాగే విద్యను డబ్బున్న వాళ్ళ 'సరుకు'గా పరిమితం చెయ్యడమే మీ భవిష్యత్ వ్యూహమా అని సామాన్య విద్యార్థులు సంఘటితంగా నిలదీయాల్సిన నేపథ్యం ఇది.. బహుశా ఇలాంటి ప్రశ్నలు ఎదురు కాకుండా ఉండేందుకే రిజర్వేషన్ల పేరు చెప్పి విద్యార్థులను విభజించే, సమస్యను పక్కత్రోవ పట్టించేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి.

ఉన్నత విద్యాసంస్థలలో ప్రస్తుతం ప్రకటించిన రిజర్వేషన్లు ఆయా వర్గాలకు చెందిన డబ్బున్న వాళ్ళకి, బ్యూరోక్రాట్ల పిల్లలకి, ఎమ్మెల్యేలు, ఎంపీల వారసులకి తప్ప... మరెవరికీ పనికిరావు. ఈ కోణాన్ని రిజర్వేషన్లకు నిజంగా అర్హులైన విద్యార్థులు ఎండగట్టాలి.

ఒకవైపు సమాజంలో ప్రతిభకి అర్థం మారిపోయేట్టు చేస్తూ, మరో వైపు దానికి అన్యాయం జరగకుండా ఉన్నత విద్యా సంస్థలలో జనరల్ విద్యార్థులకు సీట్లు పెంచుతామనడం మరీ హాస్యాస్పదం. ఇప్పటికే ఈ విద్యాలయాల్లో సరిపడా ప్రొఫెసర్లు లేరు. లాబ్స్‌లో ఆధునిక పరికరాల కరువుంది. అలాగే లైబ్రరీ సౌకర్యాలు..ఇదంతా చూస్తుంటే మింగ మెతుకు లేదు... అనే సామెత గుర్తుకు రావడం లేదూ.. స్వాతంత్ర్యం వొచ్చి యాభై ఏళ్ళు దాటాయి.. ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్య దాదాపు 10 రెట్లకు పైగా పెరిగినా కేవలం ఏడు ఐఐటీలు, ఐదు ఐఐఎమ్‌లు మాత్రమే మనకున్నాయి. వీటిలో సగం పైగా సంస్థలు 40 ఏళ్ళ కిందట మొదలుపెట్టినవి. కొత్తగా సంస్థలను నెలకొల్పే స్థోమత లేకపోతే, ఉన్నవాటిని అభివృద్ధి పరిచి, వాటికి ఐఐటీలతో సమాంతరమైన హోదా ఇస్తే బాగుంటుందని ప్రొఫెసర్ ఆనంద కృష్ణన్ కమిటీ ఏనాడో సలహా ఇచ్చింది.. కనీసం ఆ పని చేసి, రిజర్వేషన్లని అమలులోకి తెస్తే, విద్యా ప్రమాణాల గురించి వీళ్ళకి అంతో ఇంతో చిత్తశుద్ధి ఉందనిపించేది. ఎలాగూ ప్రమాణాల గురించి మాట్లాడుకుంటున్నాం కాబట్టి కొన్ని వాస్తవాలు కూడా తెలుసుకుందాం. ప్రపంచంలోని 'టాప్ 300' విద్యాలయాల్లో మన విద్యా సంస్థ ఒక్కటి కూడా లేదు. 'టాప్ 500'లో మాత్రం 3 సంస్థలకు స్థానం దక్కింది. ఇక మన పక్కనే ఉన్న చైనాకు 'టాప్ 500'లో 18 విద్యాలయాలున్నాయి. అంతటితో ఆగకుండా వాటిని 'టాప్ 100' లిస్టులోకి తీసుకురావాలనే పట్టుదలతో ఉంది. నా వరకు మన ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ప్రమాణాలను చెడగొట్టకుండా ఉంటే చాలనిపిస్తోంది.

ఇక మొత్తం రిజర్వేషన్ విధానం గురించి జరుగుతున్న వాదోపవాదాలకు వొద్దాం. రిజర్వేషన్లను తొలుత భారత దేశంలో ప్రవేశపెట్టినప్పుడు ఇంత వ్యతిరేకత లేదు. 'అవసరమైన' వారికి న్యాయం జరగటంలో తప్పులేదనే భావన వ్యక్తమయింది. ఒకవేళ కొంత మది అలా భావించకపోయినా, అగ్రవర్ణాలుగా తాము చెలాయించిన ఆధిపత్యం, అఘాయిత్యాల తాలూకు అపరాధభావం ఏమూలో ఉండబట్టి, ఇంత పెద్ద ఎత్తున బయటికొచ్చి మాట్లాడే సాహసం చెయ్యలేకపోయారు. అయితే నేటి వాతావరణంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. సాంకేతికంగా మన రాష్ట్రంలో, దేశంలో అనేక కులాలున్నా, మన సమాజం నేడు రెండే రెండు ప్రధాన వర్గాలుగా చీలింది. ధనిక, పేద... రాను రాను ఇదే తేడా వెనుకబాటు తనానికి ప్రధాన అవరోధంగా మారబోతోంది. ఈ మార్పును గుర్తించి విధానాన్ని పునర్ నిర్వచించాల్సిన అవసరం కాదనలేనిది. కానీ పిల్లి మెడలో గంటెవరు కడతారు...? 15 శాతం ఓట్లకి 70 శాతం ఓట్లకి లంకె ఎక్కడ కుదురుతుంది... లాజిక్కే మరి!

టాప్ -500 లిస్ట్

http://ed.sjtu.edu.cn/rank/2005/ARWU2005TOP500list.htm